# మత్తకోకిల

ఆ అమ్మాయి, రోజూ సరిగా అదేవేళకు అక్కడకు వస్తుంది. గోదావరి అలలమీద గాలిబంతులులాగా ఎగరేసుకుంటూ వెన్నెల చారికలు చీకటిదొంతరలను తరమడం మొదలుపెట్టగానే, మోడైపోయిన చెట్టు, ఉగ్గంవేరుమీదనుంచి, మోపినతల ఎత్తి, నేలను ఆసరాతీసుకుని లేచి, వంతెనమీదనుంచి వచ్చే రైలు పొల్లుకూతలో కలిపి, ఇగుర్చుకుపోయిన గుండెలు విచ్చేటంత కేకపెట్టి, బావురుమనడం, ఇంటిగుమ్మం ఎక్కేలోపల సముదాయించుకుంటుంది. పవలల్లా ఇంటినిపడి వేయి వెర్రులు ఎత్తినదానిలాగా తిరుగుతుంది. మౌనంగా సమాధిలో పడిపోయినట్టు సాలభంజికలాగా వ్రాలిపోతుంది. మూసినకన్ను సూర్యుడు క్రుంకుతూండగా...ఏనుగంత సత్తువతో...గోదావరిగట్టుకు...ఎండిన వ్రాని మొదలుకు...

ఎందుకు వెళుతుందో తెలియదు. ఏమి కావాలి? ఏం హాయి అనుభవించాలి? -- ఆమెకు కావలసినవాళ్ళే అర్థం తెములుచ్కోలేక ఆ ప్రశ్నలు వేసుకోవడం మానుకున్నారు. ఎక్కడకు వెళుతుందో, ఎప్పుడు వస్తుందో, గమనించరు. ఏమీ అనరు. కలకలలాడే ముఖాలతో కాని, అవసరంవచ్చినపుడన్నా పలుకరించరు.

ఆమె మానాన ఆమె బ్రతికి బాగుంటే చాలు... ఇష్టంవచ్చినట్టుగా ఉండటానికి ఎవరూ ఏ అభ్యంతరమూ చెప్పరు. కానిపనేమీ చేస్తూన్నదనికాదు వాళ్ళవాళ్ళ ఆవేదన...ఎంతటి అకృత్యమైనా చేసి, ఆమె మళ్ళా బాహ్యస్మృతి తెప్పించుకుంటే, అదే చాలు.

పడుచుపిల్ల...నోరూరించగల వయసులోఉన్న సంపన్నులపడుచు ఒంటరిగా వేళగాని వేళ, దొరికినప్పుడు, ఎంత సౌమ్యుడికైనా, నాడి కదనుత్రొక్కుతుంది. ఒకరిద్దరు, మీదుగా రాచుకుపోవడం, చేతికి చేయికలిపి నిలవేయడం--ఇలాటి సన్నాహాలు చేసి చూశారు. కాని, దారుమూర్తిలాగా స్పర్శను గమనించకుండా అడుగు నిలపకుండా, ఏ విధమైన ఖంగారూ లేకుండా...పోయే అమ్మాయి... ప్రాణంమీద ఆశ ఉన్నవాడెవడూ, ఆమె జోలికిరావడం మానివేయడంలో ఆశ్చర్యం ఏమీలేదు.

'ఎవరమ్మా నీవు?' – ఎంతమంది ఎన్ని చోట్ల ఎన్ని వేళల్లో ఆ ప్రశ్న ఎన్ని గొంతులతో అడిగారు? చెవికెక్కిందా? ఇదీ వానిలోనే జమ.

'ఎవ రా కూర్చున్నది?'-- రెండోనాడు ప్రశ్నలో క్రమం మారింది కాని, ఆమెవాలకం అంతమాత్రాన వినపడలేదు.

'ఎవరంటే...మాట్లాడవేం?'– రెండు రోజులనుంచీ ఓపికగా చూస్తున్నాడు, ఆ షికారీ. లంకలలోకి పిట్టలవేటకు తెప్ప వేసుకు వెళ్ళి...ఆకాశం ఎర్రపడినతర్వాత నీటి వాలున ఒడ్డుకుచేర్చి వెన్నెల వచ్చేదాకా తెడ్డుతో అలలు రేపుతూ, అనంతంలోకి చూస్తూ కూర్చుని ఉంటాడు ఆ వయసుకాడు. ఎగువను గట్టుమీద పడుచు మెసలడం

సడికట్టాడు. పలుకరింపులు వినిపించుకోకపోవడం మూలాన ఎవరో జగజంతకదా అని ఏనాటి కానాడు, నావలో అడుగు కారులో పెట్టేటప్పటికి మరచిపోయేవాడు. ఒకనాడు, రెన్నాళ్ళు...ఇక కథ కొంచెం ముదరనిద్దామనే ఉత్సాహం వేసింది. దగ్గరకు వెళ్ళాడు. వెన్నెల విచ్చగానే, చంద్రబింబంకన్న మెరిసింది ఆమె ముఖం. సూదివార ఎడంలేకుండా పూసుకుని నిలుచున్నాడు. ఆమె చలించలేదు. వల్లమాలిన చొరవచేసి, పెదవి ఎంగిలి చేశాడు. ముదురుపాకం హల్వాముక్కలాగా అధరం పలుమొనకు ఎదురుతిరిగి గంటును కోరుకుంది. చురుకుకు, ఆమె కళ్ళల్లోకి జీవం కమ్ముకువచ్చింది...చేరలకు మీరిపోయినది. అతనిమీదుగా గోదావరిలోకి చూసింది.

'రావూ...అలలలోనుంచి ఇంకా లేచి రావేం?'

అతనికి అర్థంకాలేదు. తన భయం మాపుకునేందుకు ఆమెను సందిటపట్టుకున్నాడు.

'నీలాగే నేనూ మునిగిపోతున్నాను.'

ఈ కేకలతో, ఆ సాహసికి వణుకుపుట్టుకువచ్చింది. కాని గంద్రగోళంగా ఆమె విషాద – గాథ అర్థం అయింది.

'మాయమౌతావా...మునిగిన చోటుకూడా దాచేసుకుంటున్నావా?'

ధైర్యంవచ్చి...ముద్దులలో ఆమెకు ఊపిరి బెసగకుండా చేశాడు. వాడిన తామర తూడులాగా అయిపోయి, వాలిపోతే... చెట్టుమొదలు జారవిడిచి కారుదగ్గరకు పరుగెత్తాడు.

ఆ మరునాడు... నీటిమీదుగా కాకుండా... కారులో యకాయకిని... గట్టుదగ్గరకు వచ్చేశాడు. చెట్టు... ఆ మోడులేదు. నరుకులైన, తుండ్లరాసి చెల్లాచెదురుగా పడి ఉంది. ఆ అమ్మాయీ లేదు.

మనసు నిలువక...ఎక్కడికీ పోవాలనే ఆలోచన లేకుండానే గట్టుపుచ్చుకుని ఎగువ ఎక్కుతున్నాడు; దూరాన... ఆమెజాడ కనిపించింది. బెదురుగా వెళ్ళాడు. చెంగున లేడిపిల్లలాగా అతని కౌగిటలోకి దుమికి,

'వెన్నెల వచ్చినా...ఎంతసేపని నీకోసం వెదకాలి?' అన్నది.

'చీకటి అంటే నాకు భయం.'

'నాకూ భయమే.'

'వద్దు. నీకు కావాలంటే నక్షత్రాలు చిదిపి దీపం పెడుతాను. మసకన్నమాట కనిపించదు.'

'సై౯'

ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని, చిన్నపిల్లలులాగా గంతులు వేస్తూ పరుగెత్తారు. ఆమె నవ్వు తెరలు తెరలుగా పొర్లి... కారు హారన్‌లో లయించింది. గట్టుమీదికి ఐమూలగా చాలాదూరంవరకూ కారు జంటదీపాలు చీకటిని చీల్చి చెండాడడానికి వెదకుతూ దౌడుతీస్తున్నవి. దీపమాలికలాగా వంతెనమీదనుంచి రైలు రంయిన పరుగెత్తింది. గోదావరిలో ఉద్ధేలంగా లేచిన కెరటం ఒడ్డుకు రాకుండానే చదునై వెన్నెలలో విరిగినంతమేరా ఒడిదుడుకులతో మిలమిలలాడింది.

★ ★ ★